ప్రజాశక్తి
మంగళవారం 30 జులై 2024
5
శ్రీ సత్యసాయి

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి మడకశిర రూరల్, మడకశిర

మండల పరిధిలోని గుండుమల గ్రామంలో ఆగస్టు 1వ తేదీన నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్న నేపథ్యంలో సిఎం పర్యటన ఏర్పాట్లను ఉన్నతాధికారులు సోమవారం పరిశీలించారు. కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా ఎస్పీ రత్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కుంచిలిగ,వక్కలిగ సాధికర సమితి కన్వీనర్ పాండురంగప్ప, గుండుమల మాజీ సర్పంచ్ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

హెలీపాడ్, ప్రజావేదిక స్థలాన్ని పరిశీలించిన డిఐజి

సిఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో గుండుమల గ్రామంలోని హెలిపాడ్ స్థలాన్ని, ప్రజా వేదిక స్థలాన్ని డిఐజి పరిశీలించారు. పర్యటన ఏర్పాట్ల గురించి ఎస్పీ రత్నతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చేతన్, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, డీఎస్పీ బాబీజాన్ తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీనే వందశాతం పింఛన్ల పంపిణీ జరగాలి

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - మడకశిర

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 1వ తేదీకే వందశాతం జరగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మడకశిర తాహశీల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ ఉదయం 5.30 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారభించి మొదటి రోజునే వందశాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం ముందస్తు చర్యలలో భాగంగా మునిసిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు ముందు రోజునే నగదు బ్యాంకుల నుండి డ్రాచేయనుకోనేలా చర్యలు చేపట్టాలన్నారు. పింఛన్ల పంపిణీలో సచివాలయ అన్ని శాఖల సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో కూలీలకు వంద రోజులు పనులు కల్పించాలని అలాంటి కుటుంబాలు సంఖ్య పెరగాలని అధికారులను ఆదేశించారు. ఏయే మండలాలలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఖాళీగా ఉన్నాయో పరిశీలించి వాటిని త్వరితగతిన భర్తీ చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అర్బన్ ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్లు ఉదయం సమయంలో పాల్గొనాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీ సెక్రెటరీ, ఈవోఆర్డీలు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో తిరగాలని తెలిపారు. అక్రమ లేఅవుట్ల నివారణకు డిపిఒ, అహుడా కలిసి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుమునుపు జిల్లా కలెక్టర్ మడకశిరలో ఉన్న పర్యట శాఖ అతిథిగృహం, మండల పరిషత్ విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. రేపటిలో పనులు పూర్తిచేయాలనిసంబంధిత అధికారులను ఆదేశించారు, ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ జెడి పద్మావతి, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న పాత తప్పిదాలు

- నామినేషన్‌పై రూ.34.52 కోట్ల పనులు
- వివరణ ఇవ్వాలని నోడల్ కమిటీ సభ్యులకు తాఖీదులు
- జెఎన్‌టియులో నిబంధనలకు విరుద్ధంగా పనుల అప్పగింత
- తప్పు చేసిన వారే పీఠంపై ..?

జెఎన్‌టియు భవనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జెఎన్‌టియులోని నోడల్ కమిటీ సభ్యులను పాత తప్పిదాలు వెంటాడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్‌పై పనుల కేటాయింపు చేసిన కమిటీ సభ్యులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణివ్వాలనని కోరుతూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి నుంచి ఉత్తర్వులు వెలువడటం ఇప్పుడు అనంతపురం జెఎన్‌టియులో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ ఉత్తర్వులొచ్చి నెల రోజులవుతున్నా గట్టుగా దాచిపెట్టడం చర్చనీయాంశమవుతోంది. గత నెల అంటే జూన్ 26వ తేదీన ఈ ఉత్వర్వులు వెలువడ్డాయి. అప్పటి నుంచి ఎవరికి వారు మౌనంగా ఉంటూ వస్తుండటం గమనార్హం.

నిబంధనలకు విరుద్ధంగా రూ.45 కోట్లు అదనపు చెల్లింపులు

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని కలికిరి ఇంజనీరింగు కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించింది. ఈ పనులను డిఇసి ఇన్‌ఫ్రా అనే సంస్థకు కేటాయించారు. ఎనిమిది విడతల్లో ఈ నిధులను విడుదల చేశారు. అయితే డిఇసి ఇన్‌ఫ్రాతో మొదట కుదుర్చుకున్న ఒప్పందం కంటే ఎక్కువ నిధులను కేటాయిస్తూ నోడల్ కమిటీ అనుమతులు కూడా లేకుండా పనులు చేపట్టారు. ఇందులో రూ.375 కోట్ల పనులు చేపట్టగా రూ.337 కోట్లు చెల్లింపులు కూడా చేశారు. అంటే ఎటువంటి అనుతుల్లేకుండానే అదనపు పనులు చేపట్టడంతోపాటు బిల్లులు రూ.45 కోట్లు నిర్మాణ సంస్థకు ఇచ్చేశారు. దీనిపై ఒక వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో 2018లో దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు కూడా జరిగింది. ఆడిట్ జనరల్ విచారణ చేపట్టి అదనపు చెల్లింపులు వాస్తవమేనని తేల్చింది.

నామినేషన్‌పై రూ.34.52 కోట్లు

లక్ష రూపాయలకు మించిన ఏ పనులను నామినేషన్‌పై చేపట్టవద్దని ప్రభుత్వ ఉత్తర్వులున్నా అనంతపురం జెఎన్‌టియులో మాత్రం ఏకంగా రూ.34.52 కోట్ల విలువైన పనులను నామినేషన్‌పై నిర్మాణ సంస్థకు అప్పగించారు. అది కూడా నోడల్ కమిటీ అనుమతులు కూడా తీసుకోకుండా ఏకపక్షంగా పనులు అప్పగించారు. దీనిపైనా నోడల్ కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఇప్పుడు ఉన్నత విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది.

తప్పు చేసిన వారే పీఠంపై ?

నిబంధనలకు విరుద్ధంగా ఆనాడు పనులు అప్పగించిన వారు, చెల్లింపులు చేసిన వారే ఇప్పుడు పీఠం ఉండటం కొసమెరుపు. ఆనాడు నోడల్ కమిటీలో సభ్యులుగా ఉండి నిబంధనలు పాటించని అధికారులే ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సిన స్థానంలో కూర్చొని ఉండటం గమనార్హం. దీంతో ఇప్పుడు ప్రభుత్వ ఉత్తర్వులు అమలు ఏ రకంగా ఉండనున్నాయన్నది జెఎన్‌టియులో చర్చనీయాంశమైంది.

పని చేస్తారా.. చర్యలకు సిఫార్సు చేయాలా..?

అధికారులపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆగ్రహం
ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో అకౌంట్ సెక్షన్, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారుల మధ్య గత కొన్ని రోజులుగా కోల్డ్ వార్ జరుగుతోది. దీనిని ప్రజాశక్తి దినపత్రికలో 'పురం మున్సిపాలిటీలో కోల్డ్ వార్' శీర్షికన సోమవారం కథనం వెలువడింది. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి సోమవారం స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఇంజనీరింగ్, అకౌంటెంట్ సెక్షన్ అధికారులతో సమావేశమై అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురం పురపాలక సంఘానికి మంచి పేరు ఉందని, ఆ పేరును అలాగే నిలబెట్టాలని అన్నారు. ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో పురపాలక సంఘానికి చెడ్డ పేరు వస్తోందన్నారు. ఇదే విధంగా అధికారులు ప్రవర్తిస్తే చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికే పురపాలక సంఘంలో జరిగిన అవినీతిపైన విచారణ చేపట్టాలని ఆదేశించామని, విచారణ అధికారికి అకౌంట్ సెక్షన్ గదిని కేటాయించి, అక్కడ విధులు నిర్వహించే సిబ్బందిని హాల్ లోకి మార్చాలని కమిషనర్‌కు సూచించారు. ఇకపై ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గంజాయిని నిర్మూలిస్తాం

మంత్రి సవిత

ప్రజాశక్తి- పెనుకొండ

రాష్ట్రంలో గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌తో పాటు పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల జీవితాలు పాడవుతాయని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటిని వినియోగించే వారిని గుర్తించి వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచిం చారు. అనంతరం విద్యార్థుల చేత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ, ఐసిడిఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, సీఐ యుగంధర్, ఎస్ఐ రాజేష్, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపళ్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

డ్రగ్స్ సరఫరాపై చర్యలు తీసుకోండి మేడం : ఇంటర్ విద్యార్థిని షాజి

'రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోండి మేడం' అని పట్టణంలోని శ్రీసత్యసాయి కళాశాల ఇంటర్ విద్యార్థిని షాజి మంత్రి సవితకు విన్నవించారు. సరఫరా చేసే వారిని నియంత్రిస్తే డ్రగ్స్ వాడకం పూర్తిగా తగ్గుతుందన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత ఈ విషయంపై కట్టుబడి ఉన్నారని, రాబోయే కాలంలో డ్రగ్స్‌ను రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

వందపడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం

మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. అలాగే ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు సిబ్బంది కొరత లేకుండా చూస్తామని, కొత్త భవనాలు నిర్మిస్తామని తెలిపారు. మంత్రి సోమవారం సాయంత్రం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని సందర్శించి వివిధ వార్డుల్లో కలియ తిరిగారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ మాధవిని అడిగి ఆసుపత్రి సమస్యలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించేలా చొరవ చూపాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో తూతూమంత్రంగా ఏరియా ఆసుపత్రిని ప్రారంభించినా రోగులకు సేవ చేయలేని దుస్థితి కల్పించారన్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాల ఉద్యోగులు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. మంత్రి వెంట డాక్టర్ కుమార్, తిప్పేంద్రనాయక్, సూపరింటెండెంట్ మాధవి, డిప్యూటీ డిఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

చిరుద్యోగులపై బెదిరింపులు ఆపకపోతే ఆందోళనలు

మహిళకు జరిగిన అన్యాయంపై ఎమ్మెల్యే స్పందించకపోవడం శోచనీయం
అంగన్వాడీ కార్యకర్తను పరామర్శించిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ఆసుపత్రిలో బాధితురాలు నాగమణితో మాట్లాడుతున్న జి.ఓబులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

నాయకుల వేధింపులు తాళలేక ఓ అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే ఎమ్మెల్యే స్పందించకపోవటం శోచనీయమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు విమర్శించారు. అధికారపార్టీ నాయకుల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓడిసి మండలం వీరప్పగారిపల్లికి చెందిన మినీ అంగన్వాడీ వర్కర్ నాగమణి కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈమెను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు సోమవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అండతో అధికార పార్టీ నాయకులు రెచ్చిపోతున్నారని విమర్శించారు. మహిళలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పార్టీ నాయకులు సిఎం ఆదేశాలను పట్టించుకోకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మినీ అంగన్వాడి కార్యకర్తపై వ్యక్తిగతంగా కక్ష పెంచుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఆంజనేయులు లేనిపోని ఆరోపణలతో అధికారులకు ఫిర్యాదు చేసి పరువు ప్రతిష్టలను దెబ్బతీసే విధంగా వ్యవహరించాడని దీంతో కార్యకర్త నాగమణి ఏమి చేయాలో దిక్కుతోచక ఆత్మహత్యానికి పాల్పడిందని అన్నారు. ఈ ఘటన సభ్య సమాజం తల దించుకునేలా ఉందన్నారు. ఎమ్మెల్యే సింధూర ఒక మహిళా ఎమ్మెల్యే గా ఉండి సాటి మహిళకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోకపోవడం సబబు కాదన్నారు. వేధింపులు గురి చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఆంజనేయులుపై 15 రోజుల క్రితం ఓబుల్ దేవర చెరువు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు స్పందించలేదని వేధింపులు తాళలేక నాగమణి ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టిందని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా నియమితులై ఉంటారని ఈ విషయం గుర్తుంచుకుంటే మంచిదని హితువు పలికారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా లేనిపోని సాకులు చూపుతూ పార్టీల ముద్ర వేసి తొలగింపులకు పాల్పడే విధంగా ఆరోపణల చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పుట్టపర్తి శాసనసభ్యులు సింధూర రెడ్డి ఈ ఘటనపై స్పందించకపోవడం వెనక అంతర్యం ఏమిటో అన్న అనుమానం వ్యక్తం చేశారు. తక్షణం ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఆంజనేయుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సింధూర ఇంట్లో పనిచేస్తున్నారని దీన్ని అలుసుగా తీసుకున్న ఆంజనేయులు అంగన్వాడి కార్యకర్తపై వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. దాడికి గురైన అంగన్వాడీ కార్యకర్తపై సానుభూతి వ్యక్తం చేసిన మరో ఇద్దరు అంగన్వాడీ కార్యకర్తలు సుహాసిని, సునీత బాయిపై కూడా ఆంజనేయులు ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి దాడికి పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్పీ స్పందించి తక్షణమే అంగన్వాడీ కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడిన ఆంజనేయులు ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం : అంగన్వాడీ కార్యకర్తకు జరిగిన అన్యాయంపై పోలీస్ అధికారులు స్పందించి టిడిపికి చెందిన ఆంజనేయులును అరెస్టు చేసి శిక్షించకపోతే పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హెచ్చరించారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్న పోలీస్ శాఖ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తూ చిరుద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి మనోవేదనకు గురి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, భాగ్యమ్మ, సుజాత, వెంకటలక్ష్మి, సిఐటియు నాయకులు జిఎల్. నరసింహులు, ఎస్ఎఫ్ఐ బాబ్జాన్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపకపోతే ఆందోళనకు సిద్ధం :

పుట్టపర్తి అర్బన్ : అంగన్వాడి వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపకపోతే ఆందోళనలు తప్పవని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్. వెంకటేష్, జిల్లా అంగన్వాడి వర్కర్ల సంఘం అధ్యక్షులు మాబున్నీసా హెచ్చరించారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వీరప్ప గారి పల్లికి చెందిన టిడిపి కార్యకర్త ఆంజనేయులు వేధింపులు భరించలేక అంగనవాడి కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీ నాయకులు తమ ప్రభుత్వాలు వచ్చినప్పుడల్లా ఇలా రాజకీయ వేధింపులు తొలగింపులు జరుగుతున్నాయన్నారు. టిడిపి నాయకుడు ఆంజనేయులపై సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి వి. శ్రీదేవి, జిల్లా కార్యదర్శి దిల్షాద్, జిల్లా కోశాధికారి సి.యన్. శ్రీదేవి, మున్సిపల్ వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

హిందూపురం : రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో హిందూపురం సిప్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నట్లు స్థానిక అకాడమీ నిర్వాహకురాలు మాలతీ తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి విద్యార్థులు వివిధ ప్రాంతాల నుండి హాజరైనట్లు ఆమె తెలిపారు. ఈ పోటీలకు హిందూపురం సిప్ అకాడమీ నుండి 72 మంది విద్యార్థులు హాజరవగా ఇందులో పదవ స్థాయిలో సాయి ప్రవచన, ఎనిమిదవ స్థాయిలో సాయి అశ్విన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా 18 మంది విద్యార్థులు ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలువగా 38 మంది విద్యార్థులు ప్రతిభ అవార్డులను పొందినట్లు మాలతి వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి సిప్ అకాడమీ హెడ్ గోపాలకృష్ణ బహుమతులు అందజేసినట్లు ఆమె చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నిర్వాహకులు మాలతీ తదితరులు అభినందించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ఎంవిఐ శివశంకర్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రవేటు విద్యాసంస్థల నిర్వాహకులు విద్యార్థులను తరలించే బస్సుల విషయంలో నిబందనలు పాటించక పోతే కేసులను నమోదు చేయాల్సి ఉంటుందని ఎంవిఐ శివ శంకర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం పట్టణంలో వివిధ పాఠశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. వాహనాలకు సంబందించిన రికార్డులను పరిశీలన చేశారు. ఈ సందర్బంగ ఆయన మాట్లాడుతు ప్రతి పాఠశాల బస్సులు ఫిట్ నెస్ ఉండాలన్నారు.

ప్రతి పేదవాడికీ ఇంటి స్థలం ఇవ్వాల్సిందే

సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామక్రిష్ణ

ప్రజాశక్తి బత్తలపల్లి

రాష్ట్రంలో గత పాలకుల భూదాహానికి గుడి, బడి భూములు సైతం కబ్జాకు గురయ్యాయని, వాటన్నింటిని వారి నుండి విడిపించి భూమిలేని నిరుపేదల భూమి పంపిణీ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రానికి సమీపంలోని నిడిమామిడి మఠం భూమిలో పేదలు గుడిసెలు వేసిన స్థలాన్ని ఆయన సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, నియోజక కార్యదర్శి మధుతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలనలో వైకాపా నేతలు వారి అనుచరులు కబ్జా చేయని భూమంటూ లేదన్నారు. ఎక్కడ పడితే అక్కడ భూకబ్జాలకు పాల్పడి దొంగ డాక్యుమెంట్లు సృష్టించి అధికారులను మెప్పించి రిజిస్టర్లు చేయించుకున్నారని విమర్శించారు. అదే విధంగానే నిడిమామిడి మఠం భూమిని మాజీ ఎంఎల్ఎ అనుచరుడు అధికారులతో కుమ్మక్కై పిత్రార్జితం కింద రికార్డులు మార్చి కొత్తగా రికార్డులు సృష్టించారన్నారు. కోట్ల రూపాయల విలువైన దాదాపు 20 ఎకరాల భూమి తప్పుడు అధికారుల చేతివాటానికి మరొకరి చేతిలోకి వెళ్లిందన్నారు. ఈ రికార్డులు మార్చేందుకు సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. మదనపల్లిలో సైతం ఇలాంటి తప్పుడు అధికారుల వల్లనే భూములు వేరొకరి చేతిలోకి వెళ్లగా ఈ ప్రభుత్వం వాటిని తిరగదోడుతుందనే కారణంతో జాయింట్ కలెక్టర్ కార్యాలయంలోనే రికార్డులకు నిప్పు పెట్టారన్నారు. నిడిమామిడి మఠం భూమి వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పేదలకు ఇంటి స్థలం వచ్చేలా చూస్తామన్నారు. ఇక్కడ గుడిసెలు వేసుకున్న పేదలెవ్వరూ ఎవ్వరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని చెప్పారు. జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇళ్లు, భూమి ఉండాలన్నదే సిపిఐ విధానమన్నారు. నియోజకవర్గ కార్యదర్శి మధు మాట్లాడుతూరికార్డులు మార్చి భూమిని కాజేయాలని చూస్తున్న వారికి ఈ భూమి దక్కకుండా చేసి పేదలకు దక్కేలా చేస్తామన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలం వచ్చేంతవరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బండల వెంకటేషు, కుళ్లాయప్పలతో పాటు పెద్ద ఎత్తున నిరుపేదలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

స్పెయిన్ కోచ్‌లను సన్మానిస్తున్న ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆర్‌డిటి సహకారంతో ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న బాస్కెట్ బాల్ శిక్షణ సోమవారం ముగిసింది. శిబిరంలో స్పెయిన్ దేశానికి చెందిన ఈగల్ బాస్కెట్ బాల్ అంతర్జాతీయ స్థాయి కోచ్‌లు మార్, ఒరియోల్, నటాలియా, పోల్ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు రోజు అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్‌లను క్రీడాకారులు సన్మానించారు. కోచ్‌లు మాట్లాడుతూ ఏ క్రీడలోనైనా మెలకువలు పాటిస్తే తప్పక విజయం సాధిస్తారన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలని వారు క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బత్తలపల్లి : రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాల విద్యా ర్థులు ముగ్గురు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. పాఠశాలలో సోమవారం వారు మాట్లాడుతూ ఆదివారం అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీల్లో బాలికల సబ్ జూనియర్ విభాగంలో ఏ.చరిత, జూనియర్స్ బాలికల విభాగంలో ఎస్.చందన, బాలుర విభాగంలో ఎస్.ఇబ్రహీం ఎంపికయ్యారన్నారు. వీరు సెప్టెంబర్‌లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంఇఒ సుధాకర్ నాయక్, టిడిపి నాయకులు తరిగోపుల చౌదరి, దివాకర్ నాయుడు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

వీరసైనికుల సేవలు చిరస్మరణీయం

బుక్కపట్నం : కార్గిల్ యుద్ధ వీరుల సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్ కొనియాడారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కార్గిల్ విజయ దివస్ నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో సైనికులు ప్రదర్శించిన సాహసాలను కొని యాడారు. వారి ప్రాణ త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవి కుమార్, అధ్యాపకులు ఓబులేసు, శ్రీనివాసులు, వెంకటేశ్వరప్రసాద్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

రాజమోళ్లపల్లితండాలో ప్రబలిన విష జ్వరాలు

నల్లచెరువు : మండలంలోని రాజమోళ్లపల్లితండాలో విషజ్వరాలు ప్రబలాయి. సుమారు 40 మంది విషజ్వరాలతో బాధపడుతూ కదిరి, నల్లచెరువు, మదనపల్లి, అనంతపురం, పులివెందల, తదితర ప్రాంతాలకు వెళ్లి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అనిల్‌నాయక్, సోమలానాయక్, భీమ్లానాయ క్, కమలమ్మ, రమణనాయక్, సోము, చక్కరమ్మ, వేములనాయక్, రమణనాయక్, రాజు, ఈశ్వరమ్మ, తదితరులు విషజ్వరాలతో ఆసుపత్రి పాటయ్యారు. ఇకనైనా అధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

లేబర్‌ఆఫీస్ ఏర్పాటుచేయాలని వినతి

ధర్మవరం టౌన్ : పట్టణంలో లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సిఐటియు ఆధ్వర్యంలో ఆర్డీవో వెంకట శివరామిరెడ్డికి విన్నతి పత్రం అందజేశారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్లు అయూబఖాన్, ఎల్.ఆదినారాయణ, నాయకులు ఎస్‌హెచ్.బాషా మాట్లాడుతూ ధర్మవరంలో గతంలో లేబర్ ఆఫీస్ ఉండేదని, కానీ సత్యసాయి జిల్లా ఏర్పాటైన తర్వాత కొత్తచెరువుకు తరలించారన్నారు. దీంతో ధర్మవరం పట్టణంతో పాటు రూరల్, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి, తాడిమర్రి, కనగానపల్లి మండలాల కార్మికులకు ఇబ్బందిగా మారిందన్నారు. కావున ధర్మవరంలో లేబర్ ఆఫీస్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు విన్నవించామన్నారు.

ఇన్‌ఛార్జి ఈవోఆర్‌డీగా ఇంద్రబాల

కొత్తచెరువు : మండల ఇన్‌ఛార్జి ఈవోఆర్‌డీగా బుక్కపట్నం మండలంలో పనిచేస్తున్న ఇంద్రబాల సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవోఆర్‌డీ సిద్ధారెడ్డి ఉద్యోగోన్నతిపై పెనుకొండకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఇంద్రబాల మండలంలోని పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే సకాలంలో ఇంటి, నీటి పన్నులు వసూలు చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో కార్యదర్శులు సురేందర్ రెడ్డి, శ్రావణ్, గంగాధర్‌రెడ్డి, సుధాకర్, రామ్‌గోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో దారి తొలగింపు

పెనుకొండ : అనుమతులు లేకుండా వెలసిన అక్రమ లేఅవుట్ దారిని సోమవారం నగర పంచాయతీ అధికారులు తొలగించారు. కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా వెలసిన అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమతులు లేకుండా 44వ జాతీయ రహదారి పక్కన షిర్లాన్ హోటల్ వెనుక ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్‌లో జెసిబితో రహదారిని తొలగించామన్నారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు అన్ని అనుమతులు ఉన్న లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

గాండ్లపెంట : గాండ్లపెంటలో అంబేద్కర్ భవన్, శ్మశానవాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ మంజూరు చేయాలని పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్థలం మంజూరు చేస్తే భవనాన్ని ఏర్పాటు చేసుకుంటామన్నారు. అలాగే 50 ఏళ్లుగా శ్మశానవాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థలం చూపాలని కోరారు. స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ ఈ విషయాలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. వారిలో డి.ఆనంద్, చిన్నోడు, నరసింహులు, కొండయ్య, వెంకటేష్, గోపాల్‌నాయక్, బాలకృష్ణ, ఆంజనేయులు నాయక్ ఉన్నారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

కదిరి అర్బన్ : ఎమ్మెల్యే కందికుంట ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో ఉన్న మురికి కాలువ సమస్యను పరిష్కరిం చారు. మున్సిపల్ సిబ్బంది జెసిబితో కాలువలో పూడికను తొలగించారు. డ్రెయినేజీలో పూడిక పేరుకుపోయి కొన్ని రోజులుగా మురికి నీరు ముందుకు కదలక దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ ప్రాంత వాసుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే స్పందించి పూడిక తీత పనులు చేయించారు.

బదిలీ తహశీల్దార్‌కి సన్మానం

చిలమత్తూరు : సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇక్కడ బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ భాగ్యలత సొంతజిల్లా(అన్నమయ్య జిల్లా)కు బదిలీ కావడంతో సోమవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యాలయ సిబ్బంది తహశీల్దార్ సేవలను కొనియాడారు. తహశీల్దార్ భాగ్యలత మాట్లాడుతూ ఉద్యోగులు ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ యూనస్, వీఆర్వోలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, అశ్వర్థ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ భాగ్యలతను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆసుపత్రి తనిఖీ చేసిన మంత్రి సవిత

ప్రజాశక్తి- పెనుకొండ

మంత్రి సవిత పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని సందర్శించి సూపరింటెండెంట్ మోహన్‌నాయక్ తో కలిసి పలు వార్డుల్లో కలియ తిరిగారు. మంత్రి కాసేపు రోగులతో మాట్లాడి వైద్య సేవపై ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. వైద్యులు డ్రెయినేజీ, నీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. మంత్రి వెంట టిడిపి మండల కన్వీనర్ సిద్ధయ్య, నాయకులు శ్రీనివాసులు, సూర్యనారాయణ, రమణమ్మ, లక్ష్మీదేవి, తదితరులు ఉన్నారు.

వేమన పద్యం తెలుగు ప్రజలకు ఆదర్శం : మంత్రి సవిత

ప్రజాకవి వేమన పద్యం తెలుగు ప్రజలకు ఆదర్శం అని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలి పారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 25వ తేదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేమన సాహితీయాత్ర కరపత్రాలను సోమవారం మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ వేమన పద్యం తెలుగు ప్రజల గుండె సవ్వడి అని, వేమన నీతి పద్యాలు మనిషి జీవితానికి పట్టుగొమ్మల్లాంటివి అన్నారు. అంతటి మహానుభావుడు మన ప్రాంతంలో జన్మించడం ఈ ప్రాంత వాసుల అదృష్టమన్నారు. వేమన సాహిత్యాన్ని జనంలోకి తీసుకెళ్లడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కటారుపల్లిలోని వేమన జీవసమాధి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, ఉమర్ ఫారూక్‌ఖాన్, ఎంఆర్.హనుమంత, ఎంక్యూ గ్లోబల్ ట్రస్ట్ అధ్యక్షులు కలీముల్లా, కోగిర జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న మంత్రి సవిత

పేదల దుకాణాలు తొలగింపు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కాలేజ్ సర్కిల్ నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకూ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా కాలువలపై పేదలు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను సోమవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. మున్సిపల్ అధికారులు దుకాణదారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకంగా జెసిబిలతో వచ్చి ఏకపక్షంగా తొలగింపునకు ఉపక్రమించారు. దీంతో దుకాణదారులు అక్కడికి చేరుకొని రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు తమవని, కుటుంబ పోషణ కోసం రోడ్డుపై నిల్చొని వ్యాపారాలు సాగిస్తున్నామని ఉన్నఫళంగా దుకాణాలు తొలగించడం ఏంటని ప్రశినంచారు. కాస్త గడువు ఇస్తే స్వచ్ఛందంగా తొలగించుకుంటామని అధికారులను ప్రాధేయపడ్డారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలంటే దుకాణాలు తప్పక తొలగించాల్సిందే అన్నారు. లేదంటే జెసిబితో తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు. దీంతో దుకాణదారులు విధిలేని పరిస్థితుల్లో సరుకు పెట్టెలో సర్దుకొని దుకాణాలు తొలగించక తప్పలేదు.

యంత్రంతో దుకాణం తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

దుకాణదారులకు ముందుగానే తెలిపాం : కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

పట్టణంలోని కాలేజ్ సర్కిల్‌లో రహదారికి ఇరువైపులా డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు ముందుకు సాగడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికుల నుంచి ఫిర్యా దులు అందాయి. పూడిక తీయాలంటే కాలువపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలు అడ్డుగా ఉన్నాయి. దీంతో దుకాణాలు తొలగించాలని దుకాణదారులకు తెలిపి గడువు కూడా ఇచ్చాం. గడువు ముగిసినా దుకాణాలు తొలగించకపోవడంతో తామే తొలగింపు చర్యలు చేపట్టాం.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం ప్రారంభం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని గుడిపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఎంఇఒలు ఆంజనేయు లునాయక్, ఆనంద్‌బాబు, మాజీ సర్పంచ్ కడపల్లి రంగప్ప, టిడిపి నాయకులు కడపల్లి రమణప్ప ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం హనుమంత రాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని నూతనంగా ప్రారంభించా మన్నారు. మెనూలో ఉన్న భోజనంతో పాటు సన్నబియ్యం అన్నం, పెరుగు, తదితర భోజనం అందజే యడానికి రంగప్ప, రమణప్ప ఆర్థికసాయం చేశారన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాగరాజు, రంగేష్, గణేష్, చంద్ర, టిడిపి నాయకులు నరసింహప్ప, తలారి సురేష్, సుధాకర్, తరుణ్, సోమశేఖర్, సరోజమ్మ, కడపల్లి విష్ణు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సహపంక్తి భోజనం

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం దాత ఆదినారాయన సాయంతో విద్యార్థులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం రామకృష్ణప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సహ ప్రధానోపాధ్యాయులు శివరాజ్, ఉపాధ్యాయులు వెంకటశ్రీనివాసులు, గిరిజమ్మ, శివరుద్ర, హనుమంతరెడ్డి, ప్రభాకర్, విజయ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం నాణ్యతగా అందించాలని ఎంఇఒ జయచంద్ర ఆదేశించారు. స్థానిక గాంధీనగర్ పాఠశాల, పోతులకుంట, కొడపగానిపల్లి, బైరాపురం పాఠశాలల్లో విద్యార్థులకు దాతల సహకారంతో పౌష్టికాహారం అందించారు. ఆయా పాఠశాలలను ఎంఇఒ పరిశీలించి విద్యార్థులు, దాతలతో కలిసి భోజనం చేశారు. దాతలు ముందుకొచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివయ్య, ఉపాధ్యాయులు మనోహర్, చలపతి, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రొద్దం : పౌష్టికాహారంతోనే పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. మండలంలోని కలిపి ఎంపిపి పాఠశాలలో కానిస్టేబుల్ గోపాల్ ఆర్థికసాయంతో పిల్లలకు పౌష్టికాహారం అందజేసినట్లు హెచ్‌ఎం నగేష్ తెలిపారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీకి వినతులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

భర్త నుంచి తనకు, పిల్లలకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం అమడగూరు మండలంలోని నిలువురాతిపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ వి.రత్నకు వినతిపత్రం అందజేశారు. భర్త అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ రోజూ నన్ను, నా బిడ్డలను వేధింపులకు గురి చేస్తున్నాడని, న్యాయం చేయాలని కోరుతూ బాధిత మహిళ జిల్లా కార్యాలయంలో ఎస్పీని కోరింది. గతంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసినా అతడిలో మార్పు రాలేదని వాపోయింది. బాధిత మహిళతో పాటు సిపిఎం నాయకులు రామకృష్ణ, గంగాధర్ ఉన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

పాత కక్షలతో తమపై దాడి చేస్తున్నారని కొండూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన లక్ష్మీనరసమ్మ, సిద్ధప్ప ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ ఎదుట మొరపెట్టుకున్నారు. గ్రామానికి చెందిన గురుమూర్తి తమపై పదే పదే దాడికి దిగుతున్నాడని, ఆదివారం సాయంత్రం కూడా ఇంటిపై దాడి చేసి వికలాంగుడైన తన కుమారుడిని, భార్యను తీవ్రంగా గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దాడి చేసిన సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. వారికి ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి పెడపల్లి తిప్పయ్య, నాయకులు రామాంజనేయులు, నారాయణ, విజయ్‌కుమార్, కెఎన్.బాబు, ప్రకాష్, శ్రీనివాసులు అండగా నిలిచారు.

పరిహారం చెల్లించి ఇళ్లు తొలగించండి

గోరంట్ల రూరల్ : జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నష్టపోతున్న తమకు పరిహారం చెల్లించాకే ఇళ్లను తొలగించాలని కోరుతూ సోమవారం మండలంలోని గుంతపల్లి గ్రామస్తులు తహశీ ల్దార్ అక్బల్‌బాషాకు వినతిపత్రం అందజేశారు.అలాగే ఆంజనేయస్వామి, సప్ప లమ్మ ఆలయాలతో పాటు గుంతపల్లి బ్రహ్మంగారి దేవాలయం నిర్మాణానికి పరిహారం చెల్లించాలని కోరారు. తొందరలోనే నష్టపరిహారం చెల్లిస్తామని, అంతవరకు రోడ్డు పనులు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటామని తహశీ ల్దార్ హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, జయచంద్రారెడ్డి, మహేష్, సదశివారెడ్డి ఉన్నారు. అలాగే జాతీయ రహదారి కోసం వ్యవసాయ భూములు కోల్పోతున్న తమకు తక్షణమే పరిహారం చెల్లించాలని కోరుతూ మందలపల్లి పంచాయతీకి చెందిన రైతులు తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

ఆలయానికి రూ. 20వేలు విరాళం

కదిరిటౌన్ : రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలోని కదిరి కొండ కింద ఉన్న ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనుల కోసం సోమవారం బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 20వేలు విరాళం అందజేశారు.

సిపిఎం మండల కార్యదర్శిగా ఆటో పెద్దన్న

ముదిగుబ్బ : స్థానిక సొసైటీ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శిగా ఆటో పెద్దన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్, కార్యవర్గ సభ్యులు జిఎన్.నరసింహులు సమావేశంలో పాల్గొని మండల కార్యదర్శిని ఎన్నుకున్నారు. పార్టీ విధి, విధానాలను కార్యకర్తలకు వివరించారు. అనంతరం 30 ముస్లిం కుటుంబాలు సిపిఎం అనుబంధ ప్రజాసంఘంలో చేరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, జిల్లా ప్రజానాట్య మండలి బాబు, మునాఫ్, చాంద్‌బాషా, చర్మాల ఫకృద్దీన్, చికెన్ బాబ్‌జాన్, రఫీ, రహీం, రిక్షా ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు

అంబేద్కర్ విగ్రహ కమిటీ ఏర్పాటు

ముదిగుబ్బ : మండలంలోని దొరిగల్లు గ్రామ ఎస్సీ కాలనీలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహన్ని ఏర్పాటు చేయాలని సోమవారం విగ్రహ కమిటీని ఏర్పాటు చేశారు. ముందుగా ముదిగుబ్బలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహ కమిటీ గౌరవాధ్యక్షునిగా సాకే రంగనాయకులు, మండల అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా ఉప్పలపాడు ఆది, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా రాజా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా భాస్కర్, ప్రచార కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా నరసింహులును ఎన్నుకున్నారు. దొరిగల్లులో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

బిల్లుల కోసం డ్రైవర్లు, ఫొటోగ్రాఫర్లు నిరసన

పుట్టపర్తి రూరల్ : బిల్లులు చెల్లించాలని కోరుతూ ఎన్నికల విధులకు వినియోగించుకున్న అద్దెకార్ల డ్రైవర్లు, ఫొటోగ్రాఫర్లు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు నెలలైనా బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. డ్రైవర్ యూనియన్ల నాయకులు షాన్వాజ్, రవి, శంకర్ మాట్లాడుతూ 26 వాహనాలకు సంబంధించి రూ. 6 లక్షలకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 80వేలు చెల్లించి, మిగిలిన బిల్లుల కోసం నెల రోజులుగా ఆఫీసులు చుట్టూ తిరిగి విసిగిపోయామన్నారు. బిల్లులు చెల్లించేంత వరకూ కదిలేది లేదని తేల్చి చెప్పారు. తహశీల్దార్ మాట్లాడుతూ బిల్లులు ట్రెజరీకి పంపామని వచ్చిన వెంటనే చెల్లిస్తామని సర్ది చెప్పిపోయారు. రెండు రోజుల్లో బిల్లులు చెల్లించకపోతే తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

'గుడ్ టచ్-బ్యాడ్ టచ్'పై అవగాహన

లేపాక్షి : స్థానిక కెజిబివిలో సోమవారం ఎస్ఒ నీలిమ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ గోపి హాజరై గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నతస్థాయిలో స్థిరపడి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

1న గుండుమలలో 'సిఎం చంద్రన్న పండుగ'

మడకశిర రూరల్ : మండలంలోని గుండుమల గ్రామంలో ఆగస్టు 1వ తేదీ సిఎం చంద్రన్న పండుగ చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సిఎం చంద్రబాబు గుండుమల గ్రామానికి మొదటిసారి వస్తున్న సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇల్లు, వీధులను మామిడి తోరణాలతో అలంకరించి సిఎం చంద్రబాబుకు స్వాగతం పలకాలని, ప్రతి ఇంటా సిఎం చంద్రన్న పండుగ చేయాలని నిర్ణయించినట్లు గ్రామస్తులు తెలిపారు.

దినసరి మార్కెట్ నిర్వహణకు వేలం

సోమందేపల్లి : స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచి గంగాదేవి, కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో వారపుసంత, దినసరి మార్కెట్ వేలం పాట నిర్వహించారు. గతంలో బైలా ఎక్కువగా ఉందన్న నేపథ్యంలో డిపాజిట్‌దారులు వేలంలో పాల్గొనలేదు. ప్రస్తుతం 8 నెలల కాలానికే రూ. 13 లక్షలుగా నిర్ణయించి వేలం పాట నిర్వహించగా వారపు సంతను నల్లగొండరానిపల్లికి చెందిన హరికృష్ణ రూ. 13.05 లక్షలకు, దినసరి మార్కెట్‌ను రూ.50.5వేలకు క్రిష్టప్ప దక్కించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల, టౌన్ కన్వీనర్లు సిద్దలింగప్ప, సూరి, నేతలు కిష్టప్ప, సూర్యనారాయణ, రమేష్, మద్దిలేటి, శ్రీరాములు, పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జెసి అభిషేక్ కుమార్

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జెసి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నారు. నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమం లో డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డ్వామా పిడి విజయేంద్ర ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సిపిఒ విజయ్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

20న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం

ఆరోగ్యవంతమైన పిల్లల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెసి అభిషేక్ కుమార్ పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జెసి మాట్లాడుతూ ఆగస్టు 20వ తేదీ చేపడుతున్న నులిపురుగుల నివారణ కార్యక్రమంలో 19 ఏళ్ల లోపు ఉన్న పిల్లలందరికీ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి మంజువాణి, డాక్టర్ తిప్పేంద్రనాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

లేపాక్షి : మండలంలోని పులిమితి పంచాయతీ పరిధిలోని తిలక్‌నగర్ గ్రామానికి చెందిన దేవరాజ్(25) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ గోపీ సంఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలపై విచారణ చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాలు.. కుటుంబ సమస్యలతో పాటు భార్య నాగమణి 4 నెలల క్రితం కొడుకును తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి బావిలో పడి వ్యక్తి మృతి

తలుపుల : చేపల కోసం వెళ్లి మండలంలోని కుర్లి పంచాయతీ వీరప్పగారిపల్లి గ్రామ సమీపంలో ఉన్న మాలబావిలో పడి ఇదే గ్రామానికి చెందిన భూషణ(41) మృతి చెందాడు. భూషణ బావిలో దిగి వల వేసి చేపలు పడుతుండగా ఉన్నఫళంగా ఫిట్స్ రావడంతో నీటిలో పడి మృతి చెందాడు. అటుగా వెళ్లిన పశువుల కాపరులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..

బస్సు డ్రైవర్‌తో పాటు ప్రయాణికుడికి గాయాలు

పెనుకొండ : పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై శ్రీకృష్ణదేవరాయలు కూడలిలో ఆదివారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఎస్ఐ తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుని మలుపు తిరుగుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సి.వెంకటేశ్వర్లు తీవ్రగాయాలతో బస్సులో ఇరుక్కుపోయారు. అలాగే ప్రయాణికు లు ముస్తాక్‌కు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్‌ను బయటకు తీసి క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ప్రమాదంలో కర్నూలుకు చెందిన గురుప్రసాద్, సావిత్రి, స్వాతి, లారీ డ్రైవర్ నల్లప్పకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 16 మంది ప్రయాణికులు ఉన్నారు.

ఘనంగా దుర్గాశక్తి సొసైటీ వార్షికోత్సవ మహాసభ

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలోని దుర్గాశక్తి సొసైటీ 13 వార్షికోత్సవ మహాసభను సోమవారం సొసైటీ కార్యాలయంలో సీఈఓ కవిత అధ్వర్యంలో లక్ష్మమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సిఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ సొసైటీ 2 మండలాలు 79 గ్రామాలు 361 సంఘాలు 8,655 మంది సభ్యులు రూ. 13,07,71,000 నికర విలువతో కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో వార్షిక నివేదిక, ఆర్థిక లావాదేవీలు, పాలకవర్గంలో చేర్పులు, మార్పులు గురించి ఆమె తెలిపారు. ముఖ్య అతిథులుగా టింబక్టివ్ కలెక్టివ్ వ్యవస్థాపకులు మేరి వటమట్టం, సికె.గంగూలీ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు ఒక్కో మెట్టు ఎక్కుతూ అన్ని రంగాల్లో ప్రవేశిస్తున్నారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్న పిల్లల చెక్కుల భజన, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో మేనేజర్ సుకన్య, మహాశక్తి సిఈఓ రమీజ, అసోసియేట్స్ రవళి, పావని, గౌరీ, దుర్గాశక్తి సొసైటీ సిబ్బంది, పాలకవర్గం, ఇతర సొసైటీ సిఈఓలు, అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి-కొత్తచెరువు

జనసేనపార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆశయాలను పార్టీ శ్రేణులు పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ. 500 చెల్లించి గతంలో సభ్యత్వం ఉన్న నాయకులు, కార్యకర్తలు రెన్యువల్ చేసుకోవాలని, కొత్తవారు సభ్యత్వం పొందాలన్నారు. సభ్యత్వ నమోదు పొందిన వారికి ప్రమాదం జరిగితే రూ. 50 వేలు, మరణిస్తే రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1600 మంది నమోదు చేసుకున్నారని దీనిని 5 వేలకు పెంచుతామన్నారు. ఆయా మండలాల్లో కన్వీనర్లు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పూల శివప్రసాద్, నాయకులు గాజుల నాగేంద్ర ప్రసాద్, వెంకటేష్, నరేంద్ర, శేఖర్, సల్లప్ప, మధు, నవీన్, రెడ్డప్ప, పవన్ కళ్యాణ్, సోము, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలని వినతి

గోరంట్ల రూరల్ : ఉపాధి హామీ బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరుతూ సోమవారం మండలంలోని సింగిరెడ్డిపల్లి, పూలచెట్లపల్లి గ్రామాలకు చెందిన కూలీలు ఉపాధి హామీ కార్యాలయంలో ఎపిఒ వరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కూలీలు మాట్లాడుతూ 9 వారాలకు పైగా ఉపాధి పనులు చేస్తున్నా బిల్లులు చెల్లించలేదని దీంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపిఒ మాట్లాడుతూ బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని, మంజూరు కాగానే మీ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

లేపాక్షి : మండలంలోని చోళసముద్రం గ్రామంలో సోమవారం హెచ్‌ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పర్యా వరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ పర్యావరణవేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్‌నాయుడు హాజరై కరువు జిల్లాలో మొక్కల విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. జిల్లాను కరువు రహితంగా మార్చాలని అందులో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు పెంచి ఫొటోలు పెట్టిన విద్యార్థులకు ఏటా బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎన్ని వేల మొక్కలైనా ఉచితంగా అందిస్తామని విరివిగా పెంచాలని కోరారు. శివకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జన్మదినం రోజున మొక్కలు నాటాలని సూచించారు. సదస్సులో మాజీ ఎంపీపీ వెంకటేశులు, స్కూల్ కమిటీ ఛైర్మన్ చెన్నక్రిష్ణ, నాగరత్న, హెలెన్స్, దేవీ, రవీంద్ర, ఆదినారాయణ, ఇషాక్ పాల్గొన్నారు.